మోస్తరు నుంచి భారీ వర్షం

● నేడు చెన్నై, చెంగల్పట్టు సహా 7 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్

అడయార్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నైరుతి బంగాళాఖాతంతో పాటు శ్రీలంక తీరప్రాంతాల్లో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో చెన్నై సహా ఏడు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉందని చెన్నై ప్రాంతీయ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ కారణంగా ఏడు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. ఈ అల్పపీడనం ప్రభావంతో తీర ప్రాంత జిల్లాలతో పాటు మరికొన్ని జిల్లాల్లో పిడుగులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తుందని తెలిపింది. ఈ నెల 21 వరకు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో, పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో కొన్ని చోట్ల తేలికపాటి వర్షం కురిసే అవకాశం ఉందని పేర్కొంది. సోమవారం చెన్నై, చెంగల్పట్టు, కాంచీపురం, తిరువళ్ళూరు, మైలాడుదురై, తిరువారూర్, నాగపట్టణం జిల్లాలతో పాటు పుదుచ్చేరి, కారైక్కాల్‌లో భారీ వర్షం కురిసే అవకాశం ఉన్న కారణంగా ఆరెంజ్ అలర్ట్ జారీ చేసినట్టు తెలిపారు.. విల్లుపురం, కడలూరు, తంజావూరు, రామనాథపురం, పుదుక్కోట, తూత్తుక్కుడి, నెల్లై, కన్నియాకుమారి తదితర జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో సోమవారం భారీ వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈ నెల 18న తేని, తెన్‌కాశి, నెల్లై, కన్నియాకుమారి, తూత్తుక్కుడి, విరుదునగర్, రామనాథపురం, శివగంగై జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో, 19న కడలూరు, మైలాడుదురైలో కొన్ని చోట్ల భారీ వర్షం కురిసే అవకాశం ఉందని చెన్నై ప్రాంతీయ వాతావరణ కేంద్రం విడుదల చేసిన ఒక పత్రికా ప్రకటనలో పేర్కొంది.

కోలాహలంగా

ఐప్పసి తీర్థవారి వేడుకలు

పెరంబూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మైలాడుదురై కావేరి నదీ తులాఘాట్ వద్ద కడైముడై (చివరి దశ) తీర్థవారీ ఆదివారం ఘనంగా జరిగింది. ప్రతి యేటా తమిళ మాసమైన ఐప్పసిలో తీర్థవారి నిర్వహిస్తుంటారు. ఆ ప్రకారం, ఈ ఏడాది కూడా ఐప్పసి తీర్థవారి కోలాహలంగా సాగుతోంది. తీర్థవారిలో ముఖ్యమైన తీర్థవారీ కోసం తిరువాడుదురై ఆధీనం ఆలయంలోని అభియాంబిక్లై సమేత మయూరనాథస్వామి ఆలయం నుంచి ఉత్సవమూర్తులు ఆదివారం ఉదయం బయల్దేరి కావేరి నదికి వేంచేశారు. అదే సమయంలో, అరంవలర్త నాయకి సమేత అయ్యప్పనార్ స్వామి, జ్ఞానాంబిక సమేత వదారణేశ్వరస్వామి, విశాలాక్షి సమేత కాశివిశ్వనాథ స్వామి ఆలయాల నుంచి పంచమూర్తులు కావేరి నదికి వేంచేశారు. అనంతరం ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజల అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు తీర్థవారీ నిర్వహించారు. ఈ వేడుకల్లో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని పుణ్యస్నానాలు ఆచరించారు. ఈ సందర్భంగా కావేరి నదీ తీరం వెంబడి పలు ప్రాంతాల్లో భక్తులు అన్నదానం అందజేశారు. వేడుకల్లో అవాంఛనీయ సంఘటన జరుగకుండా మైలాడుదురై ఎస్పీ స్టాలిన్ నేతృత్వంలో 300 మందికి పైగా పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.



తీర్థవారిలో పాల్గొన్న భక్తులు

టీవీకేతో పొత్తుకు ముమ్మర ప్రయత్నాలు !

చెన్నై, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వచ్చే యేడాది జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో తమకు ఎక్కువసీట్లు కేటాయించాలని, అదే సమయంలో అధికారంలోనూ తప్పనిసరిగా భాగస్వామ్యం కల్పించాలని డీఎంకే అధిష్ఠానంపై అదేపనిగా రాష్ట్ర కాంగ్రెస్ నేతలు ఒత్తిడి చేస్తున్న నేపథ్యంలో ఆ పార్టీ ఢిల్లీ పెద్దలు కొందరు టీవీకేతో పొత్తు కోసం రహస్యంగా మంతనాలు జరిపారా? టీవీకే నేత విజయ్ కాంగ్రెస్ జాతీయ నాయకుడు రాహుల్ గాంధీని రహస్యంగా కలుసుకున్నారా? ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేతో కాంగ్రెస్ నేత కేసీ వేణుగోపాల్ టీవీకేతో పొత్తుకు గల అవకాశాలను వివరించారా? ఈ ప్రశ్నలన్నీ ప్రస్తుతం సోషల్ మీడియాలో షికార్లు చేస్తున్నాయి. ఇప్పటికే కాంగ్రెస్ జాతీయ కమిటీ నేతలు ప్రవీణ్ చక్రవర్తి, గిరీష్ చోడంకర్ టీవీకే నేత విజయ్‌తో పొత్తు కుదుర్చుకునే దిశగా రహస్యంగా మంతనాలు చేస్తున్నట్లు చెబుతున్నారు. తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాల్లో జరుగనున్న ఎన్నికలకు సంబంధించి రెండు పార్టీల మధ్య ఒడంబడిక కుదుర్చుకోవాలని కాంగ్రెస్ పెద్దలు భావిస్తున్నట్లు సమాచారం.



● విజయ్‌తో కాంగ్రెస్ పెద్దల రహస్య భేటీ?

ఆ ప్రకారం తమిళనాడులో టీవీకే పాలన, కేరళ, పుదుచ్చేరిలో కాంగ్రెస్ పాలన దిశగా రెండు పార్టీల మధ్య పొత్తు కుదుర్చుకునే దిశగా కాంగ్రెస్ నేతలు పావులు కదుపుతున్నారని ఆ పార్టీకి చెందిన సీనియర్ నాయకులే చెబుతున్నారు. టీవీకే కూడా ఈ ప్రతిపాదనపై సంతృప్తిని ప్రకటించినట్లు తెలుస్తోంది. రాష్ట్ర అసెంబ్లీకి జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ 70 సీట్లు కేటాయించాలని, టీవీకే 164 సీట్లలో పోటీ చేయాలని ఓ ప్రణాళిక కూడా సిద్ధం చేసుకున్నారని టీవీకే వర్గాలు చెబుతున్నాయి. అదే సమయంలో టీవీకే నేత విజయ్ ఇటీవల రాహుల్‌గాంధీతో రహస్యంగా భేటీ అయ్యారని కూడా పుకార్లు షికార్లు చేస్తున్నాయి.

అదంతా ఒట్టిదే...

ఇదిలా ఉండగా అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకేతో పొత్తు కుదుర్చుకునే అవకాశమే లేదని టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై స్పష్టం చేశారు. టీవీకేతో ఏఐసీసీ పెద్దలు రహస్యంగా మంతనాలు జరిపినట్లు ప్రసార మాధ్యమాల్లో వస్తున్న వార్తలను ఆయన తీవ్రంగా ఖండించారు. ఇకరాహుల్‌గాంధీని విజయ్ రహస్యం గా కలుసుకున్నారన్న వార్తల్లోనూ నిజం లేదని స్పష్టం చేశారు. పొత్తుకు సంబంధించి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, రాహుల్‌గాంధీ కలిసి నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. డీఎంకే కాంగ్రెస్‌ల మధ్య పొత్తు పదిలంగా పటిష్టంగానే ఉందని ఆయన పేర్కొన్నారు.

వళ్లువర్‌కోట్టంలో

ముగిసిన పుస్తక ప్రదర్శన

● చివరి రోజు స్టాళ్లను సందర్శించిన సీఎం స్టాలిన్

అడయార్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక వళ్లువర్‌కోట్టమ్‌లో జరుగుతున్న ప్రగతి శీల పుస్తక ప్రదర్శనను ముఖ్యమంత్రి స్టాలిన్ ఆదివారం సాయంత్రం సందర్శించారు. ఈ నెల 8న 'డీఎంకే పతాక 75 వ వార్షికోత్సవాలను పురస్కరించుకుని స్టాలిన్ ప్రారంభించిన ఈ పుస్తక ప్రదర్శన ఆదివారంతో ముగిసింది. ఈ నేపథ్యంలో ఆదివారం ఆయన ఈ పుస్తక ప్రదర్శనను తన కుమారుడు, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధితో కలిసి సందర్శించారు. పుస్తకాల కొనుగోలులో పది శాతం రాయితీ కూడా ఇచ్చారు. గత వారం రోజులుగా నగరవాసుల ఆదరణ పొందిన ఈ పుస్తక ప్రదర్శన ముగింపు వేడుకలకు వచ్చిన సీఎం స్టాలిన్ ముందుగా పుస్తక ప్రదర్శనలో ఏర్పాటు చేసిన స్టాళ్ళను సందర్శించి, అనేక పుస్తకాలను పరిశీలించారు. అలాగే, పలువురు పుస్తక ప్రియులకు ఆయన ఆటోగ్రాఫ్ కూడా చేశారు. సీఎం వెంట ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆసక్తిగా చదువుతున్న సీఎం స్టాలిన్

200 స్థానాల్లో ఎన్డీయే విజయం

● నయినార్ నాగేంద్రన్ ధీమా



చెన్నై, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వచ్చే యేడాది జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే, బీజేపీ తదితర పార్టీలున్న ఎన్డీయే 200 సీట్లలో విజయం సాధించి అధికారంలోకి వస్తుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ ధీమా వ్యక్తం చేశారు. చెన్నైలో ఆదివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ అన్నాడీఎంకే, బీజేపీ పొత్తుపై రాష్ట్ర ప్రజల నుండి అపూర్వ స్పందన లభిస్తోందన్నారు. డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్ ఏకైక లక్ష్యం తనయుడికి సీఎం పదవిని కట్టబెట్టడమేనని విమర్శించారు. డీఎంకే ఎన్నికల హామీలను నెరవేర్చకపోవడం వల్ల ప్రజలంతా ఆ పార్టీని, దాని మిత్రపక్షాలను చిత్తుగా ఓడించేందుకు సిద్ధమవుతున్నారని, ఎన్డీఏ కూటమికి అనుకున్నట్లు 200 సీట్లు రాకపోయినా గతం కంటే ఎక్కువ సీట్లలో గెలుస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని పథకాలను వ్యతిరేకించడమే డీఎంకే పని అనీ, బిహార్‌లో ఎన్డీయే గెలుపును చూసి రాష్ట్ర ప్రజానీకం సైతం విస్తుపోతోందని, ఆ రీతిలోని బీజేపీ కూటమికి పట్టం కట్టాలని రాష్ట్ర ప్రజలంతా నిర్ణయానికి వచ్చేశారని చెప్పారు.

ఎలిఫెంటైన్ సర్క్యూట్

ట్రయల్ రన్‌కు విశేష స్పందన

● పాల్గొన్న పలువురు ఉన్నతాధికారులు

అడయార్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎలిఫెంటైన్ ఎనార్మస్ ఫేజ్-1ను పురస్కరించుకుని ఎలిఫెంటైన్ సర్క్యూట్ ట్రయల్ రన్ 2025ను ఆదివారం కొలత్తూరు- మాంబాక్కం గ్రీన్ కారిడార్‌లో నిర్వహించారు. ఈ ట్రయల్ రన్‌లో రాష్ట్ర దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ కె.మణివాసన్, కార్మిక శాఖ కార్యదర్శి కె.వీర రాఘవ రావు, యాంటీ కరప్షన్ విజిలెన్స్ ఐజీ ఏటీ దురైకుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ ట్రయల్ రన్ 10, 5 కిలోమీటర్ల విభాగాల్లో 'సామాజిక ఫిట్నెస్'పై అవగాహన పేరిట నిర్వహించారు. ఎలిఫెంటైన్ ఎంటర్‌ప్రైజెస్ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్ రమణన్ బాలగంగాధరన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ట్రయల్ రన్‌లో వెయ్యి మందికిపైగా ఔత్సాహికులు, కార్పొరేట్ సంస్థల ఉద్యోగులు, స్థానికులు పాల్గొన్నారు. ఇందులో ఇండియన్ ఫిట్నెస్ ఐకాన్, సినీ నటుడు మిలింద్ సోమన్‌ను 'ది ఎలిఫైంటైన్ సర్క్యూట్'కు బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రకటించారు.



ట్రయల్ రన్‌లో పాల్గొన్న ఐఏఎస్ అధికారులు, ఔత్సాహికులు

కన్నూరు సిమ్స్ నర్సరీలో

నల్లని క్యారెట్

● ప్రయోగాత్మకంగా సాగు చేస్తున్న ఉద్యానశాఖ



సిమ్స్ పార్కులో నల్ల క్యారెట్ విత్తనాలు చల్లుతున్న కార్మికులు

చెన్నై, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): క్యారెట్ నారింజ రంగులోనే పండుతుందని అందరూ అనుకుంటున్నాం. నారింజ రంగులోనే కాదు కారు నలుపు రంగులోనూ క్యారెట్ సాగు చేస్తున్నారంటే ఆశ్చర్యమే కదా!. నీలగిరిలో ఆ నలుపు రంగు క్యారెట్‌ను ప్రయోగాత్మకంగా పండించేందుకు రాష్ట్ర ఉద్యాన శాఖ నడుంబిగించింది. నీలగిరి జిల్లాలో క్యారెట్ సాగును ఆంగ్లేయులు ప్రారంభించారు. ప్రస్తుతం ఆ జిల్లాలో తేయాకు తర్వాత అధికంగా క్యారెట్‌నే పండిస్తున్నారు. ఈ నేపథ్యంలో నీలగిరి జిల్లా కున్నూరు సిమ్స్ పార్కులోని నర్సరీలో ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో మొట్టమొదటిసారిగా నలుపురంగు క్యారెట్‌ను ప్రయోగాత్మకంగా పండించేందుకు చర్యలు చేపడుతున్నారు. ఆ నలుపురంగు క్యారెట్ విత్తనాలను ఢిల్లీ నుండి తెప్పించి నర్సరీలో చల్లారు. ఆ విత్తనాలు చల్లిన నేలలో సేంద్రియ ఎరువు వేశారు. ఆ పార్కు మేనేజర్ లక్ష్మణన్ ఈ నలుపు రంగు క్యారెట్ సాగు పనులను స్వయంగా పరిశీలిస్తున్నారు. ఈ నల్లని క్యారెట్ 3 నుంచి మూడున్నర నెలల్లోగా కోతకు వస్తుంది. వీటిని ఉత్తరాది రాష్ట్రాల్లోని రెస్టారెంట్లలో, హోటళ్లలో, కేకుల తయారీలో ఎక్కువగా వినియోగిస్తుంటారు. నీలగిరి జిల్లా అంతటా నారింజ రంగు క్యారెట్ విస్తారంగా సాగుచేస్తున్నారు. వాటికి తోడుగా ప్రస్తుతం నల్ల రంగు క్యారెట్ కూడా పండిస్తున్నారు. ఈ విషయమై ఉద్యాన శాఖ ఉన్నతాధికారులు మాట్లాడుతూ నల్లరంగు క్యారెట్లలో రోగ నిరోధక శక్తి అధికంగా ఉంటుందని, పొటాషియం, కే విటమిన్ పుష్కలంగా ఉంటాయని చెప్పారు. ఈ నలుపురంగు క్యారెట్లను సబ్బుల తయారీకి కూడా ఉపయోగిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం ప్రయోగాత్మకంగా వేసిన క్యారెట్ విత్తనాలు సత్ఫలితాలనిస్తే నలుపురంగు క్యారెట్లను విరివిగా పండిస్తామన్నారు.

సింగారవేలర్ ఆలయ అర్చకుడి వివాదాస్పద వాఖ్యలు

● విచారించి చర్యలు తీసుకుంటాం: మంత్రి శేఖర్‌బాబు

చెన్నై, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నాగపట్టినం జిల్లాలోని సుప్రసిద్ధ శైవాలయం సిక్కల్ సింగారవేలర్ ఆలయ అర్చకుడు కర్ణాటకకు చెందిన భక్తులు ఆలయ విశేషాలను వివరిస్తూ 'అందరి హృదయాలలో తామర వికసించాలి' అంటూ నినాదాలు చేయడం వివాదాస్పదమైంది. ప్రస్తుతం సోషల్ మీడియా అంతా ఆ వాఖ్యలకు సంబంధించిన వీడియో వైరల్ అవుతోంది. ఈ సంఘటనపై హిందూ దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు స్పందిస్తూ ఆ అర్చకుడిపై విచారణ అనంతరం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దేవాదాయ శాఖ పరిధిలోని సిక్కల్ సింగారవేలర్ ఆలయానికి రోజూ పొరుగు రాష్ట్రాల భక్తులు వస్తుంటారు. రెండు రోజుల క్రితం ఆ ఆలయానికి బెంగళూరుకు చెందిన కొంతమంది భక్తులువచ్చారు. ఆలయంలోని శిల్పాలను చూస్తున్న ఆ భక్తుల వద్దకు వెళ్ళిన ఓ పూజారి విగ్రహాలకు సంబంధించిన వివరాలను చెబుతూ ఆలయంలోని అమ్మవారు తామరపుష్పాన్ని పట్టుకుని దర్శనమిస్తున్నారని, 'అందరి హృదయాల్లోనూ తామర వికసించాలి' అంటూ నినదించారు. కర్ణాటక భక్తుల్లో కొందరు అర్చకుడి చెబుతుండగా వీడియో తీశారు. శనివారం మధ్యాహ్నం నుంచి సోషల్ మీడియాలో ఆ అర్చకుడి మాటలకు సంబంధించిన వీడియో వెలువడింది. దానిని చూసి ప్రజలంతా విస్తుపోయారు. ఈ నేపథ్యంలో ఈ వ్యవహారంపై దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు మాట్లాడుతూ ఆలయాల్లో పనిచేసే అర్చకులు, పూజారులంతా రాజకీయాలకు అతీతంగా పనిచేయాల్సి ఉందని, సిక్కల్ సింగారవేలర్ ఆలయ అర్చకుడు ఓ పార్టీకి చెందిన చిహ్నం గురించి ప్రస్తావించడం గర్హనీయమన్నారు. దేవాదాయ శాఖ ఉన్నతాధికారులతో చర్చించి విచారణ అనంతరం ఆ అర్చకుడిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

జలాశయాల నుంచి అదనపు నీటి విడుదల

పెరంబూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జలాశయాల భద్రత దృష్ట్యా పూండి జలాశయం నుంచి 2వేల ఘనపుటడుగులు, చెంబరంబాక్కం, పుళల్ జలాశయాల నుంచి తలా 600 ఘనపుటడుగుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో తిరువళ్లూర్ జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ కారణంగా, జిల్లాలోని జలాశయాలు, చెరువులు నిండుతున్నాయి. ముఖ్యంగా చెన్నై వాసుల దాహార్తి తీర్చేలా జలాశయాల్లో నీటిమట్టాలు వేగంగా పెరుగుతున్నాయి. శుక్రవారం గణాంకాల ప్రకారం, 35 అడుగుల సామర్థ్యం కలిగిన పూండి సత్యమూర్తి సాగర్ జలాశయంలో నీటిమట్టం 33.47 ఘనపుటడుగులకు చేరుకుంది. జలాశయానికి 790 ఘనపుటడుగుల నీరు వస్తుండగా, జేబీ కాలువ ద్వారా 47 ఘనపుటడుగులు విడుదల చేస్తున్నారు. అలాగే, 24 అడుగుల పూర్తి సామర్థ్యం కలిగిన చెంబరంబాక్కం జలాశయం నీటిమట్టాలు 21.79 అడుగులకు చేరుకున్నాయి. డ్యాం భద్రత దృష్ట్యా 600 ఘనపుటడుగుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. ఇక, 21.20 అడుగుల సామర్థ్యం కలిగిన పుళల్ జలాశయంలో 19.40 అడుగుల మేర నీటిమట్టాలు చేరుకున్నాయి. జలాశయానికి 295 ఘనపుటడుగుల నీరు వచ్చి చేరుతుండగా, చెన్నై నగర వాసులకు దాహార్తి తీర్చేలా 184 ఘనపుటడుగుల నీరు విడుదల చేస్తున్నారు. రాబోయే రోజుల్లో భారీవర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం హెచ్చరికలతో, జలాశయాల భద్రత దృష్ట్యా నీటిని విడుదల చేస్తున్నట్లు ప్రజాపనుల శాఖ అధికారులు తెలిపారు.



చెంబరంబాక్కం నుంచి విడుదల చేస్తున్న జలాలు

వచ్చే యేడాది సీఎం పీఠంపై విజయ్

● 'సర్' వ్యతిరేక ధర్నాలో బుస్సీ ఆనంద్ ● రాష్ట్రవ్యాప్తంగా 38 చోట్ల ఆందోళనలు

చెన్నై, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వచ్చే యేడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో తమిళగ వెట్రి కళగం (టీవీకే) ఘనవిజయం సాధించి, పార్టీ అధ్యక్షుడు విజయ్ సీఎం పదవి చేపట్టడం ఖాయమని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ జోస్యం చెప్పారు. కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ టీవీకే ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం రాష్ట్రంలోని 38 చోట్ల ధర్నా, రాస్తారోకో నిర్వహించింది. చెన్నైలోని స్వామి శివానందసాలైలో జరిగిన ధర్నాకు టీవీకే నేతలు బుస్సీ ఆనంద్, ఆదవ్ అర్జునా నాయకత్వం వహించారు. ఆ సందర్భంగా బుస్సీ ఆనంద్ మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో సర్ చేపట్టడం ఎన్నో అనుమానాలకు తావిచ్చే విధంగా ఉందని, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కే అత్యంత విలువైనదని, అలాంటి దానిని హరింపజేసే ప్రయత్నమే ఈ 'సర్' అని అన్నారు. ఓ వైపు నకిలీ ఓటర్లను తొలగించేందుకే సర్ చేపడుతున్నట్లు చెబుతున్న కేంద్ర ఎన్నికల సంఘం మరో వైపు ఒకే వ్యక్తికి పలు నియోజకవర్గాల్లో ఓటు హక్కు కల్పించే ప్రయత్నాలు కూడా చేస్తోందని, సవరణ పనుల కోసం ప్రజలకు పంపిణీ చేస్తున్న దరఖాస్తు ఫారాలు పూర్తి చేయడం విద్యావంతులకే అర్థం కాని రీతిలో ఉందని, అలాంటప్పుడు సామాన్య ప్రజలు వాటిని ఎలా భర్తీ చేయగలరని ప్రశ్నించారు. దీని ద్వారా నిజమైన ఓటర్లను భారీ స్థాయిలో తొలగించడం ఖాయమని, ఈ కారణంగానే తమ పార్టీ సర్‌కు వ్యతిరేకంగా ఆదివారం ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహిస్తోందన్నారు. టీవీకే నేత విజయ్‌కి రోజురోజుకూ ప్రజాదరణ అధికమవుతోందని, వచ్చే యేడాది జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీని గెలిపించి ఆయనను సీఎం సీటులో కూర్చోబెట్టాలని ప్రజలంతా కంకణం కట్టుకున్నారని చెప్పారు. ఇదిలా ఉండగా చెంగల్పట్టు పాత బస్‌స్టేషన్, కాంచీపురం కలెక్టర్ కార్యాలయం వద్ద, తిరువళ్లూరు ఆసుపత్రి రోడ్డులో టీవీకే నాయకులు ఆందోళనలు నిర్వహించారు.





ప్లకార్డులు పట్టుకుని 'సర్'కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న టీవీకే నేతలు బుస్సీ ఆనంద్, ఆదవ్ అర్జునా తదితరులు - ధర్నాలో పాల్గొన్న ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు



మీనాక్షి మేఘాలి

తమిళ టీచరుగా బెంగాలీ నటి

బెంగాలీ నటి మీనాక్షి మేఘాలి ఒక చిత్రంలో తమిళ టీచరు పాత్రలో నటిస్తున్నారు. లెనిన్ వడమలై దర్శకుడు రూపొందించిన చిత్రం 'యారు పోట్ట కోడు' అనే చిత్రంద్వారా కోలీవుడ్‌కు మీనాక్షి పరిచయమవుతున్నారు. ప్రభాకరన్ హీరో. ఇప్పటికే చిత్రీకరణ పనులు పూర్తి చేసుకుని త్వరలోనే విడుదలకు సిద్ధంగా ఉంది. ఈ చిత్ర విశేషాల గురించి దర్శకుడు లెనిన్ వడమలై మాట్లాడుతూ, 'ఒక మనిషి సాటి మనిషిని కించపరిచేలా చూడరాదు. సమాజంలో హెచ్చుతగ్గులు ఉండరాదు అన్న కాన్సెప్టుతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం. కృష్ణగిరి, దాని పరిసర ప్రాంతాల్లో 38 రోజుల పాటు చిత్రీకరించాం. మరో రెండు రోజులపాటు తిరువళ్లూరులో షూటింగ్ చేశాం. ఈ సినిమాలో హీరో ప్రభాకరన్, హీరోయిన్ మీనాక్షి మేఘాలిలు ఉపాధ్యాయ పాత్రల్లో నటించారు. కృష్ణగిరి కొండల్లో కొలువైవున్న శ్రీలక్ష్మి నరసింహ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలుచేసి షూటింగ్ ప్రారంభించగా, ఎలాంటి అంతరాయాలు లేకుండా సాఫీగా సాగిపోయింది' అని పేర్కొన్నారు.

మొట్టై రాజేంద్రన్ హీరోగా 'రాబిన్‌హుడ్'

చిత్రజ్యోతి

ప్రముఖ హాస్య నటుడు మొట్టై రాజేంద్రన్ కథానాయకుడుగా 'రాబిన్ హుడ్' అనే చిత్రం రూపొందుతోంది. ఈ మూవీ ఫస్ట్‌లుక్ పోస్టరును తాజాగా రిలీజ్ చేశారు. 1980నాటి గ్రామీణ నేపథ్యంలో ఈ సినిమాను పళనియప్పన్ అనే నూతన దర్శకుడు రూపొందిస్తున్నారు. ఇందులో సతీష్, అమ్ము అభిరామి, సంగిలి మురుగన్, ముల్లై తదితరులు నటించారు. లూమియర్స్ బ్యానరుపై జూట్ మీనో, జనార్థిక్ చిన్నరాసా, రమణ బాలాలు కలిసి నిర్మిస్తున్నారు. నాథ్ విజయ్ సంగీతం. ఇక్బాల్ అష్మి ఛాయాగ్రహణం సమకూర్చారు. ఒక గ్రామంలో లాటరీ బహుమతి ప్రధాన వేడుక, ఆ లాటరీ బహుమతి కోసం ఇద్దరు వ్యక్తుల మధ్య తీవ్ర పోటీ, గ్రామ సమస్యలు ఇలాంటి అంశాలను తీసుకుని రూపొందించారు. ముఖ్యంగా ఇపుడు ప్రతి ఒక్కరూ మరచిపోయిన గ్రామీణ జీవితాన్ని తిరిగి గుర్తుచేస్తూ ఈ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రం ట్రైలర్‌ను దర్శకుడు హెచ్.వినోద్ విడుదల చేయగా, మంచి స్పందన వచ్చింది.



'రాబిన్‌హుడ్' ఫస్ట్‌లుక్ రిలీజ్



'నాన్ వయెలెన్స్'లో శ్రియ

'నాన్ వయెలెన్స్' కోసం శ్రియ అందాల ఆరబోత!!

ఒకప్పుడు వెండితెరపై ఓ వెలుగు వెలిగిన హీరోయిన్ శ్రియ ఇప్పుడు ఐటమ్ సాంగ్‌లో అందాలను ఆరబోసేలా డ్యాన్స్‌లు చేస్తూ అందరినీ ఆశ్చర్యపరుస్తున్నారు. 'నాన్ వయెలెన్స్' అనే పేరుతో తెరకెక్కిన మూవీ కోసం ఆమె ఐటమ్ గర్ల్‌గా మారిపోయారు. ఆ మూవీలోని ఐటమ్ సాంగ్‌లో ఆమె ఎంతో బోల్డ్‌గా, తన అందచందాలను ఆరబోశారు. ఈ పాటకు సంబంధించిన లిరికల్ వీడియో సాంగ్‌ను తాజాగా రిలీజ్ చేశారు. దీన్ని చూసిన ఆమె అభిమానులు ఔరా అంటూ నోరెళ్లబెట్టారు. తమిళంలో 'మెట్రో', 'కోడియిల్ ఒరువన్' వంటి చిత్రాలకు దర్శకత్వం వహించిన ఆనంద్ కృష్ణన్ దర్శకత్వంలో 'నాన్ వయెలెన్స్' తెరకెక్కింది. బాబీ సింహా, మెట్రో శిరీష్‌లు ప్రధాన పాత్రలను పోషించారు. యువన్ శంకర్ రాజా సంగీతం. ఈ సినిమా కోసం శ్రియపై చిత్రీకరించిన 'కనక' అంటూ సాగే ఐటమ్ సాంగ్‌ను తాజాగా రిలీజ్ చేశారు. ఈ పాట కోసం శ్రియ టూ పీస్ దుస్తులు ధరించడంతో పాటు ఎంతో బోల్డ్‌గా నటించారు. కాగా, వివాహం తర్వాత తమిళ చిత్రాల్లో నటించడం బాగా తగ్గించుకున్న శ్రియ... తాజాగో ఐటమ్ సాంగ్‌లో నృత్యం చేయడం గమనార్హం.



'నూరుసామి'లో విజయ్ ఆంటోని

చివరి షెడ్యూల్‌లో 'నూరుసామి'

దర్శకుడు శశి, హీరో విజయ్ ఆంటోనీ కాంబినేషన్‌లో రూపొందుతున్న 'నూరుసామి' చిత్రం షూటింగ్ చివరి దశకు చేరుకుంది. ఈ చిత్రీకరణ పనులు రాష్ట్రంలోని పలు గ్రామీణ ప్రాంతాల్లో చేశారు. ఇపుడు చివరి దశ షెడ్యూల్‌ను కల్లకుర్చి జిల్లాలోని ఒక గ్రామంలో చిత్రీకరిస్తున్నారు. ఈ విషయాన్ని హీరో విజయ్ ఆంటోనీ తన ఎక్స్ ఖాతాలో వెల్లడించారు. వచ్చే యేడాది మే 1వ తేదీన విడుదల చేయనున్న ఈ చిత్రంలో విజయ్ ఆంటోనీతో పాటు అజయ్ దిషాన్, స్వానిక, లిజోమోల్ జోస్ తదితరులు నటించారు. విజయ్ ఆంటోనీ సంగీతం. గతంలో శశి - విజయ్ ఆంటోనీ కాంబినేషన్‌లో 'పిచ్చైక్కారన్' మూవీ వచ్చింది. ఈ మూవీ ఘన విజయం సాధించింది. హీరోగా విజయ్ ఆంటోనీని ఓ రేంజ్‌కు తీసుకెళ్లింది. ఇపుడు వీరిద్దరూ మళ్లీ కలిసి పనిచేస్తుండటంతో 'నూరుసామి'పై భారీ అంచనాలు నెలకొన్నాయి.

ఘనంగా కార్తీక వనభోజనాలు



కార్తీక సమారాధనలో నిర్వాహకులు

ప్యారీస్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): చెన్నపురి తెలుగు విశ్వకర్మ సమాజం ఆధ్వర్యంలో స్థానిక కొరట్టూరు వాటర్‌కెనాల్ రోడ్డులో ఉన్న వీరబ్రహ్మేంద్రస్వామి ఆశ్రమంలో ఆదివారం కార్తీక మాస వనభోజన, సమారాధన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు ఉసిరిచెట్టు దీపారాధన, సత్యనారాయణ వ్రతంలో సమాజం సభ్యులు తమ కుటుంబాలతో కలిసి పాల్గొన్నారు. వనభోజన కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన మ్యూజిల్ చైర్, పరుగు పందెం తదితర పోటీల్లో పిల్లలు, పెద్దలు ఆసక్తిగా పాల్గొని బహుమతులు సొంతం చేసుకున్నారు. చిన్నారులు భరతనాట్యం ప్రదర్శించి ప్రేక్షకులను అలరించారు. ఈ పూజల్లో పాల్గొన్నవారందరికీ పసందైన తెలుగు వంటకాలు, ప్రసాదాలు పంపిణీ చేశారు. సమాజం అధ్యక్షులు కణితి రాంబాబు, ప్రధాన కార్యదర్శి వై.వసుమతి, సభ్యుడు వీవీ దుర్గాప్రసాద్, కార్యవర్గ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా... కార్తీక వన సమారాధన

ప్యారీస్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రకళా స్రవంతి (ఏకేఎస్), తమిళనాడు తెలుగు పీపుల్ సొసైటీ (టీఎన్‌టీపీఎస్) సంయుక్త ఆధ్వర్యంలో తిరువళ్లూరు జిల్లా పొన్నేరి సమీపంలోని తచ్చూరు కూట్టురోడ్డులో ఉన్న డివైన్ గార్డెన్‌లో కార్తీక మాస వన భోజనాల కార్యక్రమం ఆదివారం ఉదయం నుండి సాయంత్రం వరకు ఉల్లాసంగా.. ఉత్సాహంగా సాగింది. ఏకేఎస్ అధ్యక్షులు జేఎం నాయుడు - అన్నపూర్ణ దంపతులు, టీఎన్‌టీపీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు దేవరకొండ రాజు - సూర్యకుమారి దంపతుల పర్యవేక్షణలో నిర్వహించిన కార్తీక వన సమారాధన పూజల్లో ముఖ్యఅతిథిగా ప్రముఖ సినీనటి కస్తూరి పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ, ఇటువంటి కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల తెలుగు సంస్కృతి సంప్రదాయాల విశిష్టత గుర్తించగలుగుతున్నానని, ఏకేఎస్, టీఎన్‌టీపీఎస్ సంస్థలు భవిష్యత్తులో కూడా తెలుగుదనం ఉట్టిపడేలా కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు. ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు గోపూజ, ఉసిరి, తులసి చెట్లకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. తర్వాత సీనియర్ సిటిజన్లతో సమావేశం నిర్వహించారు. పిల్లలు, మహిళలు ఆటాపాట కార్యక్రమం చేపట్టారు. పోటీల్లో గెలిచినవారికి సిల్వర్ కాయిన్ బహుమతిగా అందజేశారు. మధ్యాహ్నం పలు రకాల ఆంధ్రా వంటకాలతో విందు ఏర్పాటు చేశారు. తెలుగు ప్రముఖులు జె.శ్రీనివాస్, శోభారాజా. ఒ.మనోహర్, ఇ.కుమార్, కేఎం దామోదర్, వి.రాజేంద్రన్, ఎంఎస్ నాయుడు తదితరులతో పాటు సభ్యులందరూ కుటుంబ సమేతంగా పాల్గొన్నారు.



కార్తీక పూజలో నటి కస్తూరి, జేఎం నాయుడు, దేవరకొండ రాజు తదితరులు

మహాబలిపురంలో గవర్నర్ ఆర్ఎన్ రవి



మహాబలిపురం సముద్రతీరంలో ఉన్న ఆలయ ప్రాంగణాన్ని సందర్శిస్తున్న గవర్నర్ ఆర్ఎన్ రవి

ప్యారీస్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు జిల్లా మహాబలిపురంలో ఉన్న పల్లవరాజుల కాలంనాటి పురాతన శిల్పకళా ఖండాలను రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి ఆసక్తిగా తిలకించారు. సముద్రతీరంలోవున్న ఆలయం, పంచ రథాలు, అర్జున తపస్సు ప్రాంతం, వెన్నముద్దరాయి తదితర శిల్పాలను పోలీసుల భద్రత మధ్య శనివారం సందర్శించారు. మహాబలిపురానికి వెళ్లిన గవర్నర్‌కు చెంగల్పట్టు జిల్లా కలెక్టర్ స్నేహ, ఎస్పీ షణ్ముగం, మహాబలిపురం పర్యాటకశాఖ అధికారి శక్తివేల్, డీఆర్‌వో పుష్పరాజ్ తదితరులు పుష్పగుచ్ఛాన్ని సమర్పించి ఘనంగా స్వాగతించారు. గవర్నర్‌కు పల్లవరాజుల చరిత్ర, వారు నిర్మించిన శిల్పాలు తదితర వివరాలను సీనియర్ గైడ్ ఆనంద్ వివరించారు. గవర్నర్ పర్యటన సందర్భంగా మహాబలిపురం ప్రాంతంలో సుమారు 200 మంది పోలీసులు మోహరించారు. భద్రతను దృష్టిలో ఉంచుకుని తీరప్రాంతంలో ఉన్న తాత్కాలిక దుకాణాలను అధికారులు తొలగించారు.

96 నెంబర్‌తో కొత్త సిటీ బస్సు ప్రారంభం



జెండా ఊపి సిటీ బస్సును ప్రారంభిస్తున్న మంత్రి ఎం.సుబ్రమణ్యం

చెన్నై, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నగరంలో 96వ నెంబర్‌తో కొత్త సిటీ బస్ సర్వీసును ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణియం ఆదివారం ఉదయం పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ బస్సు తాంబరం వెస్ట్ బస్టాండ్ నుండి అడయార్ బస్టాండు వరకు నడుపుతామని ఆయన తెలిపారు. తాంబరం వెస్ట్ నుండి ఈ బస్సు కేంప్‌రోడ్డు, పల్లికరణై, కామాక్షి ఆసుపత్రి, దురైపాక్కం, కందన్‌చావిడి మీదుగా అడయార్ బస్టాండును చేరుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో చోళింగనల్లూరు శాసనసభ్యుడు ఎస్.అరవింద్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నార్‌మన్ వాటర్‌బరి సేవలు చిరస్మరణీయం

● 140వ వ్యవస్థాపక దినోత్సవంలో వక్తలు

ప్యారీస్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): అమెరికాలో జన్మించి 1881లో భారత్‌కు కుటుంబంతో కలిసి వచ్చి మద్రాస్ ప్రిసీడియంలో ఆధ్యాత్మిక, విద్య, సామాజిక రంగాలకు అంకితభావంతో పని చేసి, తెలుగు క్రైస్తవుల కోసం ప్రార్థనా మందిరాలు నిర్మించిన రెవ.నార్‌మన్ ఎం.వాటర్‌బరి సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు కొనియాడారు. స్థానిక పెరంబూరు కుక్సురోడ్డులో ఉన్న ది వాటర్‌బరి మెమోరియల్ తెలుగు బాప్టిస్టు చర్చి (డబ్ల్యూఎంటీబీసీ) 140వ స్థాపకుల దినోత్సవం ఆదివారం ఉదయం 9.30 గంటలకు సంఘ కాపరి రెవ.డా.ఎం.పాల్ ఈశ్వరప్ప అధ్యక్షతన ప్రారంభమైంది. ఉదయం 11 గంటలకు సంఘ ప్రాంగణంలో వాటర్‌బరి ప్రతిమను ఆవిష్కరించి, విశ్వశాంతిని కాంక్షిస్తూ ప్రత్యేక ప్రార్థనలు గావించారు. గాస్పెల్ డైరెక్టర్ మందా రమేష్, నార్‌మన్ వాటర్‌బరి చరిత్రను భావితరాలకు అందించాలన్న దృక్పథంతో సేకరించిన ఫొటో, ఇతర సేవలకు సంబంధించి తెలుగు, తమిళం, ఆంగ్ల భాషల్లో విగ్రహ శిలాఫలకంలో ఆవిష్కరించి సభలో క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో భాగంగా 70ఏళ్లు పైబడిన సీనియర్ సిటిజన్లు సుమారు 75మందికి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 6 గంటలకు వరకు నిర్వహించిన బైబిల్ క్విజ్, వక్తృత్వ, ఆంధ్రా క్రైస్తవ కీర్తనల పాటల పోటీల్లో నగరంలోని పలు ప్రాంతాల్లో ఉన్న తెలుగు బాప్టిస్టు సంఘాల సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా రెవ.డా.ఎం.పాల్ ఈశ్వరప్ప, రెవ.ఆరోన్ దయాన్, పి.మదన్‌మోహన్, బెంగళూరు గాస్పెల్ సింగర్ కె.జయరాజులు వ్యవహరించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. డబ్ల్యూఎంటీబీసీ అధ్యక్షులు ఎల్.మోహన్‌కుమార్, కార్యదర్శి జి.నాగేశ్వరరావు, ఖజానాదారుడు బీఎస్.జీవన్‌బాబు, ఉపాధ్యక్షులు పి.సాంసన్, సహాయ కార్యదర్శి డీజే యెషయాబాబు, కమిటీ సభ్యులు సండే స్కూల్, యూత్, క్వయర్, స్త్రీల సమాజం నిర్వాహకులు పాల్గొన్నారు.



నార్‌మన్ వాటర్‌బరి ప్రతిమ ఆవిష్కరణ కార్యక్రమంలో పెరంబూరు తెలుగు బాప్టిస్టు సంఘ నిర్వాహకులు

కాలేయ మార్పిడిలో 'అపోలో' రికార్డు

● దక్షిణాసియాలోనే తొలి ఆస్పత్రిగా గుర్తింపు

అడయార్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): దేశంలోని ప్రముఖ కార్పొరేట్ ఆస్పత్రి అపోలో హాస్పిటల్ కాలేయ మార్పిడి (లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్)లో సరికొత్త రికార్డును నెలకొల్పింది. ఆస్పత్రిలో ఏకంగా 5 వేల లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్లను విజయవంతంగా పూర్తి చేసింది. ఈ తరహా మైలురాయిని చేరుకున్న ఆస్పత్రిగా, దక్షిణాసియాలోనే తొలి హాస్పిటల్‌గా గుర్తింపుపొందింది. ఈ సందర్భంగా అపోలో హాస్పిటల్స్ గ్రూపు ఛైర్మన్ డాక్టర్ ప్రతాప్ సి రెడ్డి స్పందిస్తూ, 1998లో తొలి పీడియాట్రిక్ కాలేయ మార్పిడి చికిత్సను విజయవంతంగా పూర్తిచేసినట్టు వెల్లడించారు. ఇపుడు ఈ సంఖ్య 5 వేలకు చేరుకోవడం వైద్యులు, వైద్య సిబ్బంది అవిశ్రాంత కృషి, స్ఫూర్తికి నిదర్శనమన్నారు. అపోలో హాస్పిటల్స్ సీఈవో డాక్టర్ మధు శశిధర్ మాట్లాడుతూ, ఈ తరహా మైలురాయిని చేరుకోవడం ఇది మా ఆస్పత్రి నిబద్ధతకు నిదర్శనమన్నారు. 1998 నవంబరు 15వ తేదీ నుంచి 2025 అక్టోబరు 10వ తేదీల మధ్య అపోలో లివర్ ట్రాన్స్‌ప్లాంట్ ప్రోగ్రామ్ కింద 5001 కాలేయ మార్పిడి శస్త్రచికిత్సలను విజయవంతంగా పూర్తి చేయగా, వీటిలో 90 శాతం కంటే ఎక్కువగా క్లినికల్ సక్సెస్ రేట్స్ సాధించాయన్నారు. కాలేయ మార్పిడి చేసిన వారిలో 4391 మంది పెద్దలు, 611 మంది చిన్నారులు, 700 మంది బ్రెయిన్ డెడ్ మృతుల దాతలు, 73 సంయుక్త కాలేయ - మూత్రపిండ మార్పిడిలు ఉన్నాయని వివరించారు.

టీవీకే ఆధ్వర్యంలో ధర్నా



ధర్నాలో పాల్గొన్న పార్టీ నేతలు

తిరువళ్లూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సంఘం నూతనంగా తీసుకొచ్చిన ఎస్ఐఆర్ నూతన విధానాన్ని నిరసిస్తూ టీవీకే ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ధర్నా నిర్వహించారు. తిరువళ్లూరు ప్రభుత్వ మెడికల్ కళాశాల ఎదురుగా జరిగిన ధర్నాకు జిల్లా కన్వీనర్ విజయకుమార్ అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ, గతంలో ఎన్నడూ లేని విధంగా ఎస్ఐఆర్ దరఖాస్తుల విధానాన్ని తీసుకుని రావడం సరికాదన్నారు. ఎస్ఐఆర్ దరఖాస్తుల పేరిట ఓటర్లను తొలగించి తద్వారా లబ్ధి పొందాలని బీజేపీ చూస్తుందని ఆరోపించారు. టీవీకే నాయకులు, కార్యకర్తలు బీఎల్‌వోతో ఇంటింటికి వెళ్లి దరఖాస్తుల పంపిణీ స్వీకరణ తదితర అంశాలను పరిశీలించాలని సూచించారు. 2026 ఎన్నికల్లో టీవీకే గెలుపు కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేసి సత్తా చాటాలన్నారు. ఈ ధర్నాలో పార్టీ నాయకులు కుట్టి ప్రకాషం, ఆర్‌కే మణిగండన్, ప్రభు, ఢిల్లీబాబు, మణి, వెంకట్రావ్ పాల్గొన్నారు.

సీఎం సీటుకు ఆశపడితే ప్రశాంత్ కిషోర్ గతే

● విజయ్‌పై బీజేపీ నాయకురాలు తమిళిసై విసుర్లు

ప్యారీస్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాజకీయ పార్టీని ప్రారంభించిన కొద్ది నెలలకే సీఎం సీటుపై ఆశపడితే బిహార్‌లో ప్రశాంత్ కిషోర్‌కు పట్టిన గతే పడుతుందని రాష్ట్ర బీజేపీ తమిళిసై సౌందరరాజన్ తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు. స్థానిక తిరువేర్కాడులో ఆదివారం రాత్రి బీజేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో తమిళిసై సౌందరరాజన్ పాల్గొని ప్రసంగించారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)ను వ్యతిరేకిస్తూ డీఎంకే, ఆ పార్టీ మిత్రపక్షాలు, టీవీకే తదితర పార్టీలు ప్రజలను తప్పుదారి పట్టించేలా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసిన రోజు నుండే సర్‌పై ఇండియా కూటమి అసత్య ప్రచారాలు సాగించిందని, అయితే ఈ ఎన్నికలు పారదర్శకంగా సజావుగా కేంద్ర ఎన్నికల కమిషన్ నిర్వహించిందని, ఆ రీతిలోనే వచ్చే ఏడాది రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు కూడా ఉంటాయని తమిళిసై నమ్మకం వ్యక్తం చేశారు. 2024 లోక్ సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని 40 నియోజకవర్గాల్లో డీఎంకే కూటమి విజయం సాధించిందని, ఆ సమయంలో ఎన్నికల కమిషన్ పనితీరును మెచ్చుకున్న సీఎం స్టాలిన్, సర్ వ్యవహారంలో ద్వంద్వ వైఖరి చూపడం సబబు కాదన్నారు. రాష్ట్రాన్ని ఏ విధంగా అభివృద్ధి పరచాలి, ప్రజల కష్టాలు ఎలా తీర్చాలి అని ఆలోచించకుండా కొత్తగా రాజకీయాల్లోకి వచ్చిన విజయ్ వచ్చే ఏడాది జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం కావాలని కలగంటున్నారని, జాతీయ రాజకీయాల్లో పేరొందిన ప్రశాంత్ కిషోర్ పార్టీకి బిహార్ ఎన్నికల్లో పట్టిన గతే విజయ్‌కు కూడా పడుతుందని ఆమె విమర్శించారు.



సభలో మాట్లాడుతున్న తమిళిసై సౌందరరాజన్

ఊబకాయం, మధుమేహం రుగ్మతలకు మెటబాలిక్ వెల్‌నెస్ సెంటర్ ప్రారంభం



ఆళ్వార్‌పేట కావేరి హాస్పిటల్‌లో మెటబాలిక్ వెల్‌నెస్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న వేల్స్ యూనివర్శిటీ వ్యవస్థాపక ఛాన్సలర్ ఐసిరి గణేష్

చెన్నై, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆళ్వార్‌పేటలోని కావేరి హాస్పిటల్‌లో స్థూలకాయం, మధుమేహం, అధిక రక్తపీడనం తదితర రుగ్మతలకు కొత్త సాంకేతిక వైద్య పద్ధతులతో చికిత్సనందించే మెటబాలిక్ వెల్‌నెస్ సెంటర్‌ను వేల్స్ యూనివర్శిటీ వ్యవస్థాపక ఛాన్సలర్ డాక్టర్ ఐసిరి గణేష్ ఆదివారం ఉదయం ప్రారంభించారు. ఆ హాస్పిటల్ సీనియర్ డయాబెటాలజిస్ట్ డాక్టర్ భరణీధరన్, కావేరి గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ సహ వ్యవస్థాపకుడు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అరవిందన్ సెల్వరాజ్, సీనియర్ ఫ్యామిలీ ఫిజిషియన్ డాక్టర్ కవితా సుందరవదనం, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మహేష్‌కుమార్, డాక్టర్ శివరామ కన్నన్, సీనియర్ ప్లాస్టిక్ సర్జన్ ప్రొఫెసర్ వీవీ నారాయణ మూర్తి, డాక్టర్ ఎస్ శేఖర్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రజలపై రాళ్లు రువ్విన సైకో అరెస్ట్

తిరుత్తణి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రామ ప్రజలపై రాళ్లు రువ్విన సైకో యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి సమీపంలోని కేజీ కండ్రిగైలో గత కొన్ని రోజుల క్రితం రోడ్డుపై వెళుతున్న మహిళలపై అస్సాం రాష్ట్రానికి చెందిన ఓ సైకో యువకుడు హఠాత్తుగా రాళ్లతో దాడికి పాల్పడ్డాడు. దీనితో మహిళలు పెద్దగా కేకలు వేస్తూ అక్కడి నుండి పరుగులు తీశారు. దీనిపై అందించిన సమాచారం ప్రకారం ఆ యువకుడి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో కేజీ కండ్రిగై సమీపంలోని డీఎన్‌ఆర్ కండ్రిగైలో ఆదివారం ఉదయం ఆ గ్రామంలోని మహిళలపై అనుచితంగా దుర్భాషలాడుతూ అసభ్యకరంగా ఆ యువకుడు ప్రవర్తిస్తుండగా, అది గమనించిన గ్రామస్తులు అతడిని తాళ్లతో కట్టేసి చితకబాదారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆ యువకుడిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు.



సైకోని తాళ్లతో కట్టేసి బంధించిన పోలీసులు

1.22 లక్షల వీధిశునకాలకు రేబిస్ టీకాలు

పెరంబూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) పరిధిలో 1.22 లక్షల వీధిశునకాలకు రేబిస్ టీకాలు వేశారు. ఈ మేరకు జీసీసీ విడుదల చేసిన ప్రకటనలో... జీసీసీ పరిధిలో వీధి శునకాలకు రేబిస్ టీకా వేసే ప్రత్యేక శిబిరాలు గత ఆగస్టు 9వ తేది ప్రారంభించామని తెలిపింది. కార్పొరేషన్ పశువైద్య శాఖ అధికారులు, వైద్య ఉద్యోగులు వీధి వీధిన తిరుగుతూ వీధి శునకాలకు రేబిస్ టీకా వేసే పనులు చేపట్టారని తెలిపింది. ఇప్పటివరకు జీసీసీ పరిధిలో 1,22,625 వీధి శునకాలకు రేబిస్ టీకాలు వేసినట్లు తెలిపింది. అలాగే, 5,483 పెంపుడు శునకాలకు లైసెన్స్ అందజేసినట్లు తెలిపింది. పెంపుడు జంతువులను సంరక్షించే యజమానులు, ఈ నెల 23వ తేదిలోపు వాటికి లైసెన్స్, మైక్రో చిప్స్ అమర్చాలని తెలిపింది. లైసెన్స్ పొందని పెంపుడు జంతువుల యజమానులకు రూ.5,000 జరిమానా విధించినట్లు జీసీసీ తెలిపింది.



చెన్నై పులియంతోపులో పెంపుడు శునకాల కోసం నిర్వహించిన రేబీస్ టీకాల శిబిరాన్ని పరిశీలిస్తున్న మేయర్ ఆర్ ప్రియా

మాంగాడు మున్సిపాలిటీలో నమూనా జనగణన

ప్యారీస్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే మాంగాడు మున్సిపాలిటీలో నమూనా జనగణన పనులను కేంద్ర ప్రభుత్వ అధికారులు ప్రారంభించారు. ప్రతి పదేళ్లకు ఒకసారి జనగణన నిర్వహించాలని రాజ్యాంగ శాసనం చెబుతోంది. అయితే గత 2011లో చివరిసారిగా దేశవ్యాప్తంగా కుల గణనను పూర్తి చేశారు. ఆ తర్వాత 2021లో ఈ ప్రక్రియను నిర్వహించకుండా పలు కారణాల వల్ల వాయిదా వేశారు. కాగా, రాష్ట్రంలో 25 కార్పొరేషన్లు, 144 మున్సిపాలిటీలు, 490 టౌన్ పంచాయతీలు, 12,525 పంచాయతీలున్నాయి. ఈ నేపథ్యంలో, కాంచీపురం జిల్లాలోని మాంగాడు మున్సిపాలిటీలో నమూనా భారతీయ జనగణన పనులు చేపట్టాలని కేంద్రం నిర్ణయించింది. ఇందుకోసం వారంరోజుల క్రితం ఆ మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఉద్యోగులు, టీచర్లకు ఓ ప్రైవేటు కళాశాలలో జనగణనపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆదివారం ఉదయం మాంగాడు మున్సిపాలిటీ పరిధిలో ఉన్న 25 వార్డుల్లో జనగణన పనులను మున్సిపాలిటీ ఛైర్మన్ సుమతి ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ ఎం.రాణి, వైస్ ఛైర్మన్ జక్కరుల్లా, కౌన్సిలర్లతో పాటు కేంద్రప్రభుత్వ అధికారులు, ప్రభుత్వ పాఠశాలల టీచర్లు, మున్సిపాలిటీ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజలకు దరఖాస్తులు అందజేసి, పూర్తిచేస్తున్నారు. నెల రోజులపాటు ఈ జనగణన సర్వే ఉంటుందని, మాంగాడు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు.



జనగణన పనులను పరిశీలిస్తున్న కేంద్ర ప్రభుత్వ అధికారులు

సమాచార దృశ్యాలు

సంబా పంట బీమా గడువు పొడిగింపు

పెరంబూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ప్రస్తుతం సంబా వరి సాగు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. 26.25 లక్షల ఎకరాల్లో రైతులు సంబా వరి పంట సాగుచేస్తున్నట్లు వ్యవసాయ శాఖ గణాంకాలు చెబుతున్నాయి. సంబా సాగుకు సంబంధించి ఇప్పటివరకు 6.27 లక్షల మంది రైతులు 15 లక్షల ఎకరాల పంటకు (57 శాతం) బీమా చేశారు. ఈ నేపథ్యంలో, పలు జిలాల్లో వర్షాలు కురుస్తుండడం, సర్ పనుల్లో గ్రామ నిర్వహణ అధికారులు బిజీగా ఉండడంతో భూములకు సంబంధించి అడంగల్ అందజేయడంలో జాప్యం చోటుచేసుకుంది. ఈ కారణంగా, తంజావూరు, నాగపట్టణం, మైలాడుదురై, తిరువారూరు, మదురై, వేలూరు, రాణిపేట, తిరుపత్తూర్, తిరువణ్ణామలై, విల్లుపురం, కడలూరు, తిరువళ్లూర్ సహా 27 జిల్లాల్లోని రైతులు సంబా వరి పంట బీమాకు ఈ నెల 30వ తేది వరకు అవకాశం కల్పించినట్లు వ్యవసాయ శాఖ మంత్రి ఎమ్మార్కే పన్నీర్ సెల్వం ఒక ప్రకటనలో తెలిపారు.

జెరూసలేం సబ్సిడీ పొందేందుకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జెరూసలేం వెళ్లిన క్రైస్తవులు సబ్సిడీ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు సచివాలయం విడుదల చేసిన ప్రకటనలో... రాష్ట్రంలోని అన్ని సంఘాలకు చెందిన 600 మంది క్రైస్తవులు లబ్ధిపొందేలా జెరూసలేం యాత్ర ముగించుకుని వచ్చిన 500 మంది క్రైస్తవులకు తలా రూ.37,000, కన్య స్త్రీలు (నన్స్)కు తలా రూ.60,000 రాయితీ అందజేసే పథకం అమలులో ఉంది. ఆ రాయితీ పొందేందుకు ఈ నెల 1వ తేది తర్వాత జెరూసలేం యాత్ర ముగించుకుని వచ్చిన క్రైస్తవులు దరఖాస్తు చేసుకోవచ్చు. జిల్లా కలెక్టర్ కార్యాలయాల్లో పనిచేసే బీసీ, ఎంబీసీ సంక్షేమ శాఖ కార్యాలయంలో దరఖాస్తులు పొంది, www.bcbcmw.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో నమోదుచేసుకోవాలి. పూర్తిచేసిన దరఖాస్తులను 'కమిషనర్, మైనార్టీ సంక్షేమ శాఖ, కలశమహల్ భవనం, మొదటి అంతస్తు, చేపాక్కం, చెన్నై-600005' అనే చిరునామాకు వచ్చే ఏడాది (2026) ఫిబ్రవరి 28వ తేదిలోపు పంపించాలని సచివాలయం ప్రకటనలో తెలిపింది.

ఇంజనీరింగ్ విద్యార్థుల కోసం స్వల్పకాలిక కోర్సుల పరిచయం

పెరంబూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కేంద్ర విద్యా శాఖ 'స్వయం' పథకం కింద సమాచార సాంకేతికత సహా వివిధ నైపుణ్యాలతో ఉచిత ఆన్‌లైన్ స్వల్పకాలిక కోర్సులు అందిస్తోంది. ఆ ప్రకారం, 'స్వయం' పథకంలో ఇంజనీరింగ్ విద్యార్థినీ, విద్యార్థులకు ఉచిత 'ఆన్‌లైన్' సర్టిఫికేట్ కోర్సులు పరిచయం చేశారు. డేటా ఆర్కిటెక్చర్, ఆర్టిఫియల్ ఇంటెలిజెన్స్, సాఫ్ట్‌వేర్ మరియు డేటా బేస్ మేనేజ్‌మెంట్ సహా తొమ్మిది రకాల స్వల్పకాలిక సర్టిఫికేట్ కోర్సులు అందిస్తున్నారు. ఆ కోర్సులను, అన్నా విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లు, ఆన్‌లైన్ ద్వారా బోధించనున్నారు. వాటిలో, కొన్ని కోర్సులు తమిళ మీడియంలో అందిస్తున్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థినీ, విద్యార్థులు http-s://swayam.gov.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో చేపట్టనున్న మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో ఈ నెల 18వ తేది ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుంది. ఈ మేరకు విద్యుత్ బోర్డు విడుదల చేసిన ప్రకటనలో... తరమణి పరిధిలోని ఎంజీఆర్ రోడ్డు, శాంతియప్పన్ రోడ్డు, కోదండరామన్ వీధి, పెరుంగుడి, ఓఎంఆర్, కామరాజ్ నగర్, కురింజి నగర్, అన్నా హైరోడ్డు, నెహ్రూ నగర్, కొట్టివాక్కం, శ్రీనివాస నగర్, జయేంద్ర కాలని, తిరువళ్లువర్ వీధి, కర్పగ వినాయగర్ వీధి, టెలిఫోన్ నగర్, చర్చ్ రోడ్డు, సీటీబీ కాలని తదితర ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని విద్యుత్ బోర్డు తెలిపింది.

ఏడు నెలల్లో రూ.45వేల కోట్ల నగల రుణాలు

పెరంబూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సహకార బ్యాంకులు, సహకార రుణ సంఘాల ద్వారా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం, ఏప్రిల్ నుంచి అక్టోబరు వరకు ఏడు నెలల్లో రూ.42 లక్షల మందికి రూ.45,000 కోట్ల మేర నగల రుణాలు అందజేశారు. రాష్ట్ర సహకార శాఖ ఆధ్వర్యంలో పనిచేసే సహకార బ్యాంక్‌లు, ప్రాథమిక వ్యవసాయ సహకార రుణ సంఘాలు తదితరాల్లో నగలపై పలురకాల రుణాలు అందజేస్తుంటారు. బంగారు నగలు కుదువ పెట్టే సమయంలో, నగలు తమకు సొంతమైనవి అనే ఆధారాలు సమర్పించడంతో పలు నిబంధనలను గత జూన్‌లో రిజర్వ్ బ్యాంక్ విధించింది. అదే సమయంలో, ఈ నిబంధనలు ప్రాథమిక సహకార రుణ సంఘాలకు వర్తించవని సహకార శాఖ ప్రకటించింది. అంతర్జాతీయ పరిస్థితుల దృష్ట్యా, బంగారం ధరలు ఎన్నడూ లేనంతగా పెరిగిపోతున్నాయి. ప్రస్తుతం సవర ఒక రూ.లక్షకు చేరువలో ఉంది. అందువల్ల, గ్రాము బంగారం ధరలో 75 శాతం రుణంగా అందజేస్తున్నారు. ఆ ప్రకారం, ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరంలో, ఏప్రిల్ నుంచి అక్టోబరు వరకు 42 లక్షల మందికి రూ.45,000 నగల రుణాలు అందజేశారు. గత ఏడాది ఇదే కాలంలో 31 లక్షల మందికి రూ.33,000 కోట్ల మేర రుణాలు అందించారు. అదే సమయంలో, గత 2024-25 ఆర్థిక సంవత్సరంలో మొత్తం 70.28 లక్షల మందికి రూ.62,001 కోట్ల రుణాలు అందజేసినట్లు సహకార శాఖ తెలిపింది.

మేట్టూరు డ్యాంకు తగ్గిన ఇన్‌ఫ్లో

పెరంబూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కావేరి నది పరివాహక ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో సేలం జిల్లా మేట్టూరు డ్యాంకు నీటి రాక తగ్గింది. డ్యాంకు శుక్రవారం 6,208 ఘనపుటడుగులుగా వస్తున్న నీరు, శనివారం ఉదయం 6,026 ఘనపుటడుగులకు తగ్గింది. డెల్టా సాగు కోసం విడుదల చేస్తున్న 12,000 ఘనపుటడుగుల నీటిని 9,000 ఘనపుటడుగులకు తగ్గించారు. ప్రస్తుతం డ్యాంలో 112.11 అడుగులతో 81.44 టీఎంసీల నీటిమట్టాలు ఉన్నట్లు ప్రజాపనుల శాఖ అధికారులు తెలిపారు.

ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించాలి

● డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత



ప్యారీస్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యబద్ధంగా అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత విజయ్‌కాంత్ కేంద్ర ఎన్నికల కమిషన్‌ను డిమాండ్ చేశారు. మదురైలో ఆదివారం ఉదయం ఏర్పాటు చేసిన డీఎండీకే బూత్ కమిటీ నిర్వాహకుల సమావేశంలో ఆమె పాల్గొని ఎన్నికలకు సంబంధించిన పార్టీ శ్రేణులకు కీలక సూచనలిచ్చారు. అనంతరం ప్రేమలత మీడియాతో మాట్లాడుతూ, తన మూడో విడత ఎన్నికల ప్రచారపర్యటన మదురైలో ప్రారంభించి డిసెంబరు 2న ఈరోడ్‌లో పూర్తిచేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రానికి రావల్సిన భారీ పరిశ్రమలు పొరుగు రాష్ట్రాలను వెతుక్కుంటూ వెళ్లడం దురదృష్టకరమని, ముఖ్యమంత్రి స్టాలిన్ పెట్టుబడుల సమీకరణపై ఇప్పటికైనా శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని ఆమె డిమాండ్ చేశారు. పార్లమెంట్, అసెంబ్లీకి జరుగుతున్న ఎన్నికల్లో ఏళ్లతరబడి అవకతవకలు జరుగుతున్నాయని, దీనిపై ఎన్నికల కమిషన్ ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందన్నారు. 2026లో తమిళనాడు అసెంబ్లీకి నిర్వహించనున్న ఎన్నికలు పారదర్శకంగా, ప్రజాస్వామ్యబద్ధంగా ఉండేలా నిర్వహించాలని ఆమె ఈసీని కోరారు. కూటమి గురించి కడలూరులో నిర్వహించనున్న మహానాడులో నిర్ణయం తీసుకుంటామన్నారు. పారిశుధ్య కార్మికులకు భోజన వసతి కల్పించినంత మాత్రాన వారి అవసరాలు తీరవని, వారి కోరికలను పరిశీలించి పరిష్కరింపజేయాలని ఆమె అన్నారు.

భర్త రివర్స్‌గేర్‌లో నడిపిన కారు ఢీకొని భార్య మృతి

అడయార్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): భర్త కారు రివర్స్ చేస్తున్న సమయంలో, ఊహించని విధంగా వెనుక నిల్చున్న భార్య ప్రమాదవశాత్తు మృతిచెందిన ఘటన తిరువళ్లూర్ జిల్లాలో చోటుచేసుకుంది. ఆవడి కోనాంబేడు ప్రాంతానికి చెందిన రాజాకు ఇందుమతి అనే భార్య ఉంది. కొద్దిరోజుల క్రితం కారు డ్రైవింగ్ నేర్చుకున్న రాజా, నెల రోజుల క్రితం కారు కొనుగోలు చేశాడు. రాజా శనివారం ఉదయం కుటుంబంతో కారులో ఆలయానికి వెళ్లి ఇంటికి తిరిగి వచ్చాడు. ఆ సమయంలో, కారును ఇంటి సమీపంలో పార్కింగ్ చేసేందుకు భార్యను కారు వెనుకగా ఉండి గమనించాలని రాజా కోరాడు. ఆమె వెనుక నిల్చున్న సమయంలో, రాజా వేగంగా కారు రివర్స్ చేయగా, కారు-గోడ మధ్య ఇందుమతి చిక్కుకుని తీవ్రంగా గాయపడింది. వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్సలు ఫలించక ఆదివారం ఉదయం ఇందుమతి మృతిచెందింది. ఈ ఘటనపై ఆవడి పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.



మృతురాలు ఇందుమతి (ఫైల్ ఫొటో)

శ్రీలంక దంపతుల కుమారుడికి భారతీయ పాస్‌పోర్ట్ జారీచేయాలి: హైకోర్టు

పెరంబూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చిలో శ్రీలంక దంపతులకు జన్మించిన బిడ్డకు భారతీయ పాస్‌పోర్ట్ జారీచేయాలని హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. తిరుచ్చికి చెందిన గోకులేశ్వరన్, తనకు భారతీయ పాస్‌పోర్ట్ మంజూరు చేయాలని హైకోర్టు మదురై బెంచ్‌లో పిటిషన్ దాఖలుచేశారు. పిటిషన్ విచారించిన న్యాయమూర్తి జస్టిస్ పీటీ ఆషా జారీచేసిన ఉత్తర్వుల్లో వివరాలు ఇలా ఉన్నాయి... పిటిషన్‌దారుడు 1986 ఫిబ్రవరి 9వ తేదీన తిరుచ్చి ప్రభుత్వాసుపత్రిలో జన్మించాడు. ఆయన తల్లిదండ్రులు శ్రీలంక నుంచి శరణార్థులుగా వచ్చి శ్రీలంక తమిళ శరణార్థుల శిబిరంలో బసచేస్తున్నారు. తాను ఇండియాలో జన్మించిన కారణంగా పౌరసత్వ చట్టం 1955 సెక్షన్ 3 ప్రకారం భారతీయ పౌరసత్వానికి అర్హుడినని పేర్కొన్నాడు. 2024 ఫిబ్రవరిలో పాస్‌పోర్ట్ కోరుతూ దరఖాస్తు చేసుకున్న సమయంలో, పోలీసు శాఖ తరఫున అతను శ్రీలంకకు చెందినవారుగా ఉండొచ్చు అని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై పిటిషన్‌దారులు సంజాయిషీ అందించినా ఫలితం లేకపోవడంతో, న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. అతడి బర్త్ సర్టిఫికేట్, ప్లస్ టూ మార్కుల జాబితా, ఆధార్ తదితరాలు సమర్పించాడు. పిటిషనర్ జనన ధ్రువీకరణ పత్రం ప్రామాణికమైనదని తిరుచ్చి కార్పొరేషన్ కూడా నిర్ధారించింది. పౌరసత్వ చట్టం ప్రకారం, 1987 జూలై 1వ తేదీకి ముందు భారతదేశంలో జన్మించిన వ్యక్తి, అతని తల్లిదండ్రుల జాతీయతతో సంబంధం లేకుండా, భారత పౌరుడిగా పరిగణించబడతాడు. ఈ కేసులో పిటిషనర్ 1987 జూలై 1వ తేదీకి ముందు జన్మించినందున చట్టం ప్రకారం భారత పౌరుడు. ఆధారాలు కూడా దీనిని అధికారికంగా నిర్ధారిస్తున్నాయి. ఈ కేసులో తల్లిదండ్రులు శ్రీలంకకు చెందిన వారు అనే కారణంగా అతడికి పాస్ పోర్ట్ జారీచేయడానికి నిరాకరించడం చట్టవిరుద్ధం. అందువల్ల, పిటిషనర్‌కు 8 వారాల్లోపు పాస్‌పోర్ట్ జారీచేయాలని న్యాయమూర్తి ఉత్తర్వుల్లో ఆదేశించారు.

రెండోరోజు ప్రశాంతంగా టెట్

● 3.37 లక్షల మంది హాజరు

అడయార్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా రెండో రోజైన ఆదివారం ఉపాధ్యాయ అర్హత పరీక్ష-2 (టెట్) ప్రశాంతంగా జరిగింది. ఈ పరీక్షకు దాదాపు 3.37 లక్షల మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఒక్క చెన్నై నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో సుమారుగా 22,932 పట్టభద్రులు ఈ పరీక్ష రాశారు. వీరి కోసం 83 పరీక్షా కేంద్రాలను అధికారులు ఏర్పాటుచేశారు. అలాగే, రాష్ట్ర వ్యాప్తంగా 1,241 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా 3.73 లక్షల మంది పట్టభద్రులు ఈ పరీక్షకు హాజరయ్యారు. కాగా, శనివారం జరిగిన తొలి పేపర్ పరీక్షకు 92,412 మంది హాజరయ్యారు. ఈ పరీక్ష కోసం మొత్తం 1.07 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. చెన్నై నగరంలో తొలి పేపర్ పరీక్షకు 6,053 మంది హాజరయ్యారు.

కల్తీ నెయ్యి తయారీ కర్మాగారం సీజ్

అడయార్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూర్ జిల్లా అవినాశిలో కల్తీ నెయ్యి తయారుచేస్తున్న కర్మాగారానికి అధికారులు సీలు వేశారు. తిరుప్పూర్‌లో కల్తీ నెయ్యి విక్రయాలు సాగుతున్నాయని అధికారులకు ఫిర్యాదులందాయి. ఈ వ్యవహారంపై విచారణ చేపట్టిన అధికారులు, అవినాశిలోని ఓ కర్మాగారంలో కర్ణాటక ప్రభుత్వానికి చెందిన 'నందిని' పేరుతో కల్తీ నెయ్యి తయారుచేస్తున్నట్లు గుర్తించారు. కర్మాగారంలో 8,136 లీటర్ల కల్తీ నెయ్యి స్వాధీనం చేసుకుని, నలుగురిని అరెస్ట్ చేశారు. ఈ కర్మాగారానికి రెవెన్యూ అధికారులు సీలు వేశారు. ఈ వ్యవహారంలో పరారీలో ఉన్న మరికొందరి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

కోవైకి రానున్న ప్రధానికి నల్లజెండాలతో నిరసన

పెరంబూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూర్‌కు ఈ నెల 19వ తేదీన రానున్న ప్రధాని మోదీకి నల్లజెండాలతో నిరసన తెలుపనున్నట్లు దక్షిణ భారత నదుల అనుసంధాన రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు అయ్యాకన్ను తెలిపారు. తిరుచ్చిలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ... కర్ణాటక నుంచి కావేరి నదిలో ప్రతిరోజు నీరు విడుదల చేయాలి, మేకెదాటు ఆనకట్ట నిర్మాణం సత్వరం నిలిపివేయాలి, జన్యుమార్పిడి పంటలను ప్రోత్సహించేలా రూ.500 కోట్ల కేటాయింపునకు వ్యతిరేకం సహా ఆరు అంశాల డిమాండ్లతో ఈ నెల 19న కోవైకు రానున్న ప్రధాని నరేంద్ర మోదీకి వ్యతిరేకంగా నల్లజెండాలతో నిరసన తెలుపనున్నామన్నారు. వ్యవసాయ ఉత్పత్తులకు తగిన గిట్టుబాటు ధర కల్పించాలి, వ్యవసాయ రుణాల మాఫీ, వ్యక్తిగత బీమా అమలు తదితర డిమాండ్లతో తిరుచ్చి నుంచి వందలాది మంది రైతులతో రాజధాని నగరంలో ఢిల్లీలో నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు అయ్యాకన్ను తెలిపారు.

హాస్టల్ విద్యార్థులకు లైంగిక వేధింపులు: తాత్కాలిక వార్డెన్ అరెస్ట్

పెరంబూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): హాస్టల్ విద్యార్థులపై లైంగిక వేధింపులకు పాల్పడిన తాత్కాలిక వార్డెన్‌ను పోక్సో చట్టం కింద పోలీసులు అరెస్ట్ చేశారు. తిరుప్పూర్ జిల్లా కాంగయం తారాపురం రోడ్డు భారతియార్ నగర్‌లో ప్రభుత్వ సాంఘీక సంక్షేమ హాస్టల్‌లో 50 మంది విద్యార్థులు బసచేస్తూ, సమీపంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్నారు. ఈ హాస్టల్ వార్డెన్‌గా మారిముత్తు వ్యవహరిస్తున్నాడు. ఈ క్రమంలో, కళ్లకుర్చికి చెందిన అరవింద్ (24) ఓ ప్రైవేటు పాఠశాలలో బీఎడ్ చదువుతుండగా, మారిముత్తు అతడిని తాత్కాలిక వార్డెన్‌గా నియమించి వేతనం అందిస్తున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో, బాలల దినోత్సవం సందర్భంగా పాఠశాలలో చైల్డ్ లైన్ అధికారులు విద్యార్థులతో సమావేశమయ్యారు. ఆ సమయంలో, తమను వార్డెన్ అరవింద్ లైంగికంగా వేధిస్తున్నట్లు పలువురు హాస్టల్ విద్యార్థులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులతో జిల్లా పిల్లల సంక్షేమ అధికారి వలర్మతి, కాంగయం మహిళా పోలీసులు శుక్రవారం హాస్టల్‌కు వెళ్లి విచారించారు. అక్కడి విద్యార్థులకు అసభ్య చిత్రాలు చూపిస్తున్న అరవింద్, వారు నగ్నంగా స్నానం చేయాలని కోరడంతో పాటు 8 మంది విద్యార్థులపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు విచారణలో తెలిసింది. పోక్సో కేసు నమోదుచేసిన పోలీసులు అతడిని అరెస్ట్ చేసి జైలుకు తరలించారు.

'నీట్' మినహాయింపు బిల్లు ఆమోదానికి తిరస్కరణ

● రాష్ట్రపతి నిర్ణయంపై సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం పిటిషన్

పెరంబూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): 'నీట్' మినహాయింపు బిల్లును ఆమోదించకుండా తిరస్కరించిన రాష్ట్రపతి నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలుచేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది పి.విల్సన్, న్యాయవాది మిషారోహ్తాక్ దాఖలు చేసిన పిటిషన్‌లో... నీట్ మినహాయింపు బిల్లుకు ఆమోదం తెలుపని రాష్ట్రపతి చర్యలు చట్టవ్యతిరేకమన్నారు. రాష్ట్రపతి తీసుకున్న చర్యలు రద్దు చేసి, నీట్ మినహాయింపు బిల్లుకు అంగీకారం తెలిపేలా ఆమోదించాలి లేదా నీట్ మినహాయింపు బిల్లు ఆమోదించేలా మళ్లీ రాష్ట్రపతికి పంపించేలా రాష్ట్ర గవర్నర్ కార్యదర్శి, కేంద్ర ప్రభుత్వానికి ఉత్తర్వులు జారీచేయాలని పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్ త్వరలో విచారణకు రానుంది.

అధికారుల తీరుపై చెరకు రైతుల నిరసన



గ్రీవెన్స్‌లో అధికారులతో మాట్లాడుతున్న రైతులు

తిరుత్తణి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): చెరకును సక్రమంగా దిగుమతి చేసుకోలేదని శుక్రవారం నిర్వహించిన రైతుల ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమంలో అధికారులపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తిరుత్తణిలో ఆర్డీవో కనిమొళి అధ్యక్షతన శుక్రవారం ఉదయం రైతుల ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో పలుశాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. ఈ క్రమంలో తిరుత్తణి, పళ్లిపట్టు, ఆర్కేపేట తదితర ప్రాంతాల నుండి వచ్చిన చెరకు రైతులు అధికారులతో మాట్లాడుతూ, చెరకులోడు లారీలను కర్మాగారంలోకి అనుమతించి, చెరకు దించడంలో తీవ్ర జాప్యం జరుగుతుందని, లారీలు కర్మాగారం చుట్టుపక్కల ప్రాంతాల్లో నిలిపిన రైతులు, కర్మాగారంలోకి ఎప్పుడు అనుమతిస్తారా అని వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంటుందన్నారు. ఈ సమస్యలను పరిష్కరించేలా అధికారులు చర్యలు చేపట్టాలని పలుమార్లు అధికారులకు విజ్ఞప్తి చేసినా ఫలితం ఉండటం లేదని చెరకు రైతులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. రైతుల వద్ద తక్కువ ధరకు చెరకును కొనుగోలు చేసి అక్రమంగా ఆంధ్రప్రదేశ్‌కు తరలిస్తున్నారని ఆరోపిస్తూ ఆర్డీవో ఛాంబర్‌ను ముట్టడించారు. దీనితో అక్రమంగా చెరకును ఆంధ్రాకు తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామని ఆర్డీవో కనిమొళి హామీ ఇవ్వగా రైతులు వెనుదిరిగారు.

తిరుమల ఘాట్‌లో కారు బోల్తా

● తమిళనాడు భక్తులకు గాయాలు



తిరుమల, నవంబరు16(ఆంధ్రజ్యోతి): తిరుపతి నుంచి తిరుమలకు చేరుకునే రెండవ ఘాట్ రోడ్డులో ఆదివారం ఓ కారు బోల్తాపడింది. చెన్నైకు చెందిన పొన్నాంబళం, గణేష్‌కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారి దర్శనం కోసం తమ టీఎన్ 11 జెడ్ 4538 నెంబరు కారులో ఆదివారం ఉదయం అలిపిరికి చేరుకున్నారు. భద్రతా తనిఖీల అనంతరం ఉదయం 10 గంటలకు తిరుమలకు బయలుదేరారు. 6వ కిలోమీటరుకు సమీపంలోని మలుపులో కారు అదుపుతప్పి బోల్తాపడింది. కారులోని ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి.

విజయ్ పార్టీకి ఎలాంటి ఇబ్బందులు కలిగించం

● మంత్రి అన్బిల్ మహేష్

ప్యారీస్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తమిళగ వెట్రి కళగం (టీవీకే)కు రాష్ట్రప్రభుత్వం ఎలాంటి ఇబ్బందులు కలిగించడంలేదని పాఠశాలల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ పేర్కొన్నారు. తిరుచ్చి సౌరాష్ట్ర వీధిలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని మంత్రి ప్రారంభించారు. అనంతరం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బందికి అవసరమైన కనీస వసతులు సమకూర్చుకునేందుకు ప్రభుత్వం నిధులు కేటాయిస్తోందని తెలిపారు. సభల్లో పాల్గొనేందుకు, ఆందోళన కార్యక్రమాలు నిర్వహించేందుకు టీవీకే పార్టీకి ప్రభుత్వం కఠిన నిబంధనలు విధిస్తోందని, ఆ పార్టీ అధ్యక్షుడు విజయ్‌ను ఇబ్బందుల పాలు చేస్తోందని, వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని, ప్రజాస్వామ్య దేశంలో ఎవరైనా రాజకీయాల్లోకి రావచ్చన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఇండియా కూటమికి సారథ్యం వహిస్తున్న డీఎంకే, మిత్రపక్షాలకు ఎన్నిసీట్లు కేటాయించాలన్న దానిపై పరిశీలించి నిర్ణయం తీసుకుంటుందని, ముఖ్యమంత్రి స్టాలిన్ కూటమిని సమర్ధవంతంగా ముందుకు తీసుకెళుతున్నారని మంత్రి తెలిపారు.

15 నుంచి అర్ధవార్షిక పరీక్షలు

పెరంబూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పాఠ్య ప్రణాళికలో 6 నుంచి ప్లస్ టూ తరగతి వరకు అర్ధవార్షిక పరీక్షల టైంటేబుల్‌ను పాఠశాల విద్యాశాఖ విడుదల చేసింది. ఆ ప్రకారం, 6 నుంచి 9వ తరగతి వరకు డిసెంబరు 15 నుంచి 23వ తేది వరకు అర్ధవార్షిక పరీక్షలు జరుగనున్నాయి. అలాగే, 10 నుంచి ప్లస్ టూ తరగతుల విద్యార్థులకు డిసెంబరు 10 నుంచి 23వ తేది వరకు అర్ధవార్షిక పరీక్షలు నిర్వహించనున్నట్లు పాఠశాల విద్యాశాఖ తెలిపింది.

లారీని ఢీకొన్న ఆమ్నీ బస్సు: 15 మందికి గాయాలు



దెబ్బతిన్న బస్సు ముందు భాగం

పెరంబూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): లారీని ఆమ్నీ బస్సు ఢీకొన్న ఘటనలో 15 మందికి గాయాలయ్యాయి. శుక్రవారం సాయంత్రం బెంగళూరు నుంచి ఆమ్నీ బస్సు 50 మంది ప్రయాణికులతో కేరళ రాష్ట్రం శబరిమల వైపుకు వెళుతోంది. తిరుప్పూర్ జిల్లా పెరుమానల్లూర్ న్యూ తిరుప్పూర్ మార్గంగా వేగంగా వస్తున్న బస్సు, ముందు వెళ్తున్న లారీని ఢీకొని ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న 15 మందికి గాయాలయ్యాయి. చుట్టుపక్కల వారు, వాహనచోదకులు క్షతగాత్రులను రక్షించి అంబులెన్స్‌ల ద్వారా సమీపంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు తరలించారు. ఈ ఘటనపై పెరుమానల్లూర్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

తిరుత్తణి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా ఆదివారం ఉదయం తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టులోని జీఆర్‌హెచ్ హెల్త్‌కేర్ అండ్ డయాగ్నోస్టిక్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఆస్పత్రి డాక్టర్లు మిథున్‌కుమార్, గోమతిల అధ్యక్షతన జరిగిన ఈ శిబిరంలో సుమారు 300 మంది ప్రజలు పాల్గొని ఉచితంగా రక్తపరీక్షలు, పలు రకాల వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఆస్పత్రి సిబ్బంది,ప్రధాన వైద్యులు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

వేలూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తాళం వేసిన ఓ ఇంట్లో చోరీకి పాల్పడిన దుండగుల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. వివరాల్లోకి వెళితే వేలూరు జిల్లా కోసపేట్టైలోని తిరుమల వీధికి చెందిన బాలకృష్ణన్ (56) ఓ ప్రైవేటు బీమా కంపెనీలో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం అతను డ్యూటీకి వెళ్లగా ఇంట్లో ఎవరూ లేరని గ్రహించిన కొంతమంది దుండగులు తాళం పగులగొట్టి ఇంట్లోని సుమారు 30 తులాల బంగారం, కిలో వెండి వస్తువులు, రూ.1.60 లక్షల నగదును దోచుకెళ్లారు. శనివారం సాయంత్రం డ్యూటీ ముగించుకుని ఇంటికి వచ్చిన బాలకృష్ణన్ తాళం పగులగొట్టి ఉండడాన్ని గమనించి ఇంట్లోకి వెళ్లి చూడగా, వస్తువులన్నీ చిందరవందరగా పడివున్నాయి. దీనితో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ఇంటిని పరిశీలించారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దుండగుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

ఉపాధ్యాయుల చొరవతో పాఠశాల గదుల నిర్మాణం పూర్తి



పూర్తయిన గదులు

తిరుత్తణి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టులోని పంచాయతీ ప్రాథమిక పాఠశాలలోని రెండు తరగతి గదులు శిథిలావస్థకు చేరుకున్నాయని ఆ పాఠశాల ఉపాధ్యాయులు గత కొన్ని నెలలుగా పలుమార్లు అధికారులకు తెలిపినా ఫలితంలేకపోయింది. దీంతో ఆ పాఠశాల హెచ్ఎం పి.ఆర్ముగం, ఉప ప్రధానోపాధ్యాయులు టి.పళని, ఎస్.హేమలత, ఉపాధ్యాయులు సుకుమార్, వి.భారతి, దేవిల భాగస్వామ్యంతో రూ.2లక్షల వ్యయంతో తరగతి గదుల నిర్మాణం పనులను పూర్తిచేసుకున్నారు. పూర్తైన ఆ తరగతి గదులను ఆదివారం ఉదయం హెచ్ఎం ఆర్ముగం రిబ్బన్‌కట్‌చేసి ప్రారంభించారు. దీనిపై విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల నిర్వాహకులను అభినందిస్తున్నారు.

బిహార్ ఎన్నికల్లో చారిత్రాత్మక విజయం

తిరుత్తణి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గత శుక్రవారం విడుదలైన బిహార్ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు దేశచరిత్రలోనే ఓ చారిత్రాత్మక ఘట్టమని, ఈ విజయ పరంపర అన్ని రాష్ట్రాల్లో కొనసాగుతుందని ఆదివారం ఉదయం తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టులో జరిగిన బీజేపీ విజయోత్సవ వేడుకల్లో మండల అధ్యక్షుడు ఎ.కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పళ్లిపట్టు పట్టణంలోని గాంధీ విగ్రహం వద్ద బీజేపీ శ్రేణులకు, ప్రజలకు ఆయన స్వీట్లు పంచిపెట్టి సంతోషాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నిర్వాహకులు రోహిత్, ఢిల్లీ సహా పలు విభాగాల నిర్వాహకులు పాల్గొన్నారు.

కుమార్తెను తల్లిని చేశాడు!

పెరంబూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కన్న కూతురిపై ఓ తండ్రి అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలు బిడ్డకు జన్మనివ్వడంతో ఈ విషయం వెలుగుచూసింది. కన్నియాకుమారి జిల్లా అరుమనై ప్రాంతానికి చెందిన 45 ఏళ్ల కొబ్బరి వ్యాపారికి 17 ఏళ్ల కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. కుమార్తె అదే ప్రాంతంలోని ఓ పాఠశాలలో ప్లస్ టూ చదువుతోంది. ఈ క్రమంలో రెండు నెలల క్రితం ఆ బాలిక తిరువనంతపురంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో బిడ్డకు జన్మనిచ్చింది. 18 ఏళ్లు పూర్తికాకుండా బాలిక తల్లి కావడంతో, ఆసుపత్రి నిర్వాహకులు మార్తాండం మహిళా పోలీస్ స్టేషన్‌లో ఆ విషయాన్ని ఫిర్యాదు చేశారు. ఆ గర్భానికి తండ్రి కారణమని తెలిసింది. ఈ ఘటనపై పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసిన పోలీసులు, కామాంధుడైన తండ్రిని జైలుకు తరలించారు.

విద్యార్థులకు క్రీడా సామగ్రి వితరణ



విద్యార్థులతో మల్లికా ప్రకాష్, ఉపాధ్యాయులు

ప్యారీస్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాజాఅన్నామలైపురంలో చెన్నపురి అన్నదాన సమాజం నిర్వహిస్తున్న డాక్టర్ వీవీ రావు మహోన్నత పాఠశాల విద్యార్థులకు తమిళనాడు ఆర్యవైశ్య మహిళా సభ-మద్రాస్ యూనిట్ వైస్ ఛైర్‌పర్సన్ మల్లికా ప్రకాష్ రూ.20వేలు విలువచేసే క్రీడా సామగ్రిని ఉచితంగా అందజేశారు. ఆమెతో పాటు కార్యదర్శి భార్గవి, కోశాధికారి ప్రసన్న, నీరజ, రజిని, చిత్రలేఖ, నంద, మహేశ్వరి, అన్నదాన సమాజం కార్యదర్శి ఉదయ్‌శంకర్, హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాశిమేడు చేపల మార్కెట్‌కు పోటెత్తిన జనం

ప్యారీస్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాయపురం శాసనసభ నియోజకవర్గ పరిధిలో ఉన్న కాశిమేడు చేపల మార్కెట్‌కు ఆదివారం వేకువజామున నాలుగు గంటలకే నగరవాసులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. అదే సమయంలో మూడు రోజులకు ముందు సుమారు 100కు పైగా నాటు పడవలు, మర పడవల్లో సముద్రంలో చేపలవేటను పూర్తి చేసుకుని తాజా చేపలను బుట్టలలో వేసుకుని తిరిగొచ్చిన జాలర్ల వద్ద చేపలు, రొయ్యలను కొనుగోలు చేసేందుకు వ్యాపారులు పోటీపడ్డారు. వలలో చిక్కిన వంజిరం, వవ్వాల్, శీలా, తిరుక్కై, శంకరా, పాల్‌సురా, తోల్‌పారై తదితర రకాలకు చెందిన చేపలను బుట్టలు బుట్టలుగా కొనేందుకు నగరవాసులు సైతం పోటీపడ్డారు. దీనితో చేపల ధరలు కూడా వంజరం ఒక కిలో రూ.1000 నుండి రూ.1,300లకు, కొడువా రూ.800, తేంగాయ్‌పారై రూ.800, శీలా రూ.500, పాల్‌సురా రూ.500, శంకర రూ.400, కిలో రొయ్యలు రూ.300, పీతలు రూ.300, మెత్తాళ్ల రూ.200లకు విక్రయించారు. పెద్దసంఖ్యలో తరలివచ్చిన కొనుగోలుదారులతో కాశిమేడు ఫిషింగ్ హార్బర్ కిటకిటలాడింది.



కాశిమేడు మార్కెట్‌లో చేపలను విక్రయిస్తున్న దుకాణదారుడు